# ఉత్తరాంధ్ర జిల్లాల్లో రంగురాళ్ల వేట - క్వారీ ప్రమాదాలు

విశాఖపట్నం జిల్లాలోని తూర్పు కనుమలలో ఉన్న జి.మాడుగుల మండలం కొంద్రపాడు దగ్గర 1997 నవంబర్ 25న 'రంగురాళ్ల క్వారీ' పైకప్పు కూలి నలుగురు గిరిజన బాలురు దుర్మరణం పాలు కావడంతో 1993 నుండి విశాఖ, తూర్పు గోదావరి, విజయనగరం ఏజెన్సీలలో నడుస్తున్న రంగురాళ్ల తవ్వకం ప్రహసనం మరొకసారి చర్చకు వచ్చింది. ఒరిస్సా,రాజస్తాన్‌ల నుండి వచ్చిన వ్యాపారస్తులకు కోట్ల రూపాయల ఆదాయం, స్థానిక బ్రోకర్లకూ రాజకీయ నాయకులకూ లక్షల రూపాయల ఆదాయం, పోలీసు అటవీ శాఖల సిబ్బందికి వేలల్లో మామూళ్లు సంపాదించిపెట్టిన ఈ విలువైన రంగురాళ్లవేట ఇప్పటికి మొత్తం 24 ప్రాణాలు తీసింది. మొదట ఒక వ్యాపారస్తుడే అరకు పోలీసుల లాఠీ దెబ్బలకు ప్రాణం వదిలాడు (1993 సెప్టెంబర్ 25). ఆ తరువాత మూడు క్వారీ ప్రమాదాలలో 23 మంది చనిపోయారు. విశాఖపట్నం జిల్లా గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెంలో జరిగిన క్వారీ ప్రమాదంలో 15 మంది గిరిజనేతర పేదలు (1994 సెప్టెంబర్ 4), తూర్పుగోదావరి జిల్లా అడ్డతీగల మండలం తపసికొండ దగ్గరున్న దుప్పులపాలెం శివారులో జరిగిన క్వారీ ప్రమాదంలో ఇద్దరు గిరిజన స్త్రీలు, ఇద్దరు గిరిజన పురుషులు (1995 మార్చి 9), విశాఖపట్నం జిల్లా జి.మాడుగుల మండలం వంజర గ్రామ పంచాయితీలోని కొంద్రపాడు సమీపంలో జరిగిన క్వారీ ప్రమాదంలో నలుగురు గిరిజన బాలురు (1997 నవంబర్ 25) చనిపోయారు.

ఈ రంగురాళ్లు వజ్రాలంత విలువైనవి కావుగానీ వెల కలిగినవే. మన దేశంలో మధ్యప్రదేశ్‌లోని పన్నాలోనూ, మన రాష్ట్రంలోని (అనంతపురం జిల్లా) వజ్రకరూర్‌లోనూ వజ్రాల గనులున్నాయి. ఇతర రకాల రంగురాళ్లు అనేక ప్రాంతాలలో దొరుకుతాయి. వాటిలో తూర్పుకనుమలు ఒకటి. తూర్పుకనుమలలోని ఒరిస్సా ప్రాంతంలోనూ మన రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలలోనూ వెల గల రంగురాళ్ల నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. వీటిని తవ్వితీయడం, సానపెట్టడం, అమ్మడం ఒక పద్ధతి ప్రకారం జరిగినట్లయితే తూర్పుకనుమల అడవులలో బతికే ఆదివాసీలకూ ఇతర పేదలకూ పని దొరికేది, ఆదాయం దొరికేది, ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో డబ్బు చెప్పుకోదగ్గ మొత్తంలో ముట్టేది. ఆ డబ్బులో కొంత భాగమైనా అడవి ప్రాంతాల అభివృద్ధికీ ఆదివాసీల అభివృద్ధికీ ఖర్చు పెట్టినట్లయితే అడవివాసుల జీవితాలు మరింత మెరుగయ్యేవి.

ఒరిస్సా రాష్ట్రప్రభుత్వం ఆ రాష్ట్రంలోని కలహండి, కోరాపుట్, సంబల్‌పూర్, మయూర్‌భంజ్ జిల్లాలలో దొరికే రంగురాళ్ల విషయంలో కొంత బాధ్యతగానే వ్యవహరించింది. వాటి తవ్వకానికి లైసెన్స్ ప్రభుత్వం ఇస్తుంది. ప్రభుత్వ పర్యవేక్షణలోనే తవ్వకం జరుగుతుంది. తవ్విన రాళ్లను సానబెట్టే లఘు పరిశ్రమ మొత్తం ఆదివాసీలకే అప్పగించబడింది. దాదాపు 12 వేల ఆదివాసీ కుటుంబాలు దీనిపైన ఆధారపడి మెరుగయిన జీవనాన్ని పొందుతున్నాయి. రాష్ట్రప్రభుత్వానికి కూడ తగుమాత్రం రాయల్టీ వస్తుంది.

మన రాష్ట్రప్రభుత్వం మాత్రం ఉత్తర కోస్తాజిల్లాల తూర్పుకనుమల అడవులలోని రంగురాళ్ల తవ్వకాన్నీ అమ్మకాన్నీ ఎటువంటి అజమాయిషీ లేని ప్రైవేట్ వ్యాపారస్తుల లాభాల వేటకు విడిచి పెట్టింది. 1993లో మొట్టమొదటిసారి విశాఖపట్నం జిల్లా అరకు ప్రాంతంలో రంగురాళ్లున్నాయన్న విషయం బయటపడినప్పటి నుండీ, ఒరిస్సా నుండీ రాజస్తాన్ నుండీ రంగురాళ్ల వర్తకులు రాబందుల లాగ ఏజెన్సీమీద వాలి, గిరిజనులు (గిరిజనేతర పేదలు కూడ) తవ్వితీసిన రంగురాళ్లను స్థానిక బ్రోకర్ల సహాయంతో చవగ్గా కొనేసి తీసుకుపోతున్నారు. రాళ్ళను సానబెట్టే పరిశ్రమ ఇక్కడ అభివృద్ధి చెందలేదు. ప్రభుత్వానికి ఆదాయమూ రావడం లేదు. గిరిజనులకు రాళ్ల తవ్వకంవల్ల వచ్చే ఆదాయం మామూలు కూలివల్ల వచ్చే ఆదాయం కంటే బాగా ఎక్కువేగానీ దానికి భరోసాలేదు. రోజంతా కష్టపడినా ఒక్క రంగురాయీ దొరక్కపోతే శ్రమంతా వృధాయేకాక ఆదాయం శూన్యం. రాయి దొరికితేనే ఆదాయం. అంతేకాక అవ్యవస్థితంగా జరిగే ఈ తవ్వకంలో భద్రతా నియమాలేవీ పాటించరు కాబట్టి ప్రమాదాలు జరగడం, కాళ్లు చేతులు విరగ్గొట్టుకోవడం మామూలయి పోయింది. ఈ క్రమంలోనే 23 ప్రాణాలు పోయాయి.

ఈ లోపాలన్నిటినీ ప్రభుత్వానికి ఎవరూ ఎత్తి చూపకపోలేదు. దిన పత్రికలు రాస్తూనే ఉన్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం జియాలజీ శాఖకు చెందిన పరిశోధకులు పదేపదే ప్రభుత్వానికి సూచనలు పంపించారు. అయినా ప్రభుత్వానికి పెద్దగా పట్టలేదు.

ఉత్తరాంధ్రలోని 13 మండలాల లోని 26 గ్రామాల పరిధిలో రంగురాళ్ల

> రంగురాళ్లను తవ్వితీయడం, సానపెట్టడం, అమ్మడం ఒక పద్ధతి ప్రకారం జరిగినట్లయితే తూర్పుకనుమల అడవులలో బతికే ఆదివాసీలకూ ఇతర పేదలకూ పని దొరికేది, ఆదాయం దొరికేది, ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో డబ్బు చెప్పుకోదగ్గ మొత్తంలో ముట్టేది. ఆ డబ్బులో కొంత భాగమైనా అడవి ప్రాంతాల అభివృద్ధికీ ఆదివాసీల అభివృద్ధికీ ఖర్చు పెట్టినట్లయితే అడవివాసుల జీవితాలు మరింత మెరుగయ్యేవి.

నిక్షేపాలున్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం నిపుణుల అంచనా. ఆ మండలాలు : గొలుగొండ, పాడేరు, అరకు, చోడవరం, వి.మాడుగుల, జి.మాడుగుల, జి.కె.వీధి, చింతపల్లి, సబ్బవరం, అనకాపల్లి (విశాఖపట్నం జిల్లా), పాలూరు (విజయనగరం జిల్లా), అడ్డతీగల, రంపచోడవరం (తూర్పు గోదావరి జిల్లా). ఈ 13 మండలాలలోని 26 గ్రామాలలో దాదాపు 5000 కోట్ల రూపాయలు నిలువ చేసే రంగురాళ్ల నిక్షేపాలున్నాయని వారు అంచనా వేశారు. అందులో కొన్ని వందల కోట్లు విలువ చేసే రాళ్లు (పై పొరలలో దొరికేవి) ఈ నాలుగున్నర సంవత్సరాలలో ప్రైవేట్ వర్తకుల చేతిలోకి వెళ్లిపోయాయి.

ఒరిస్సాలో ఎప్పటినుండో దొరుకుతున్న నిలువైన రంగురాళ్లు విశాఖపట్నం కొండలలోనూ ఉన్నాయన్న సంగతి మొట్టమొదటిసారిగా 1993 జూలై నెలలో తెలిసింది. అరకు మండలంలోని తురాయిగుడలో ఒక గిరిజనుడికి కాకతాళీయంగా దొరికిన రంగురాయిని అతను ఒరిస్సాకు చెందిన ఒక వ్యక్తికి చూపించగా అతను దాని విలువను గ్రహించాడనీ ఆ విధంగా అరకులోయలో విలువైన రంగురాళ్లున్నాయన్న విషయం బయటి కొచ్చిందనీ అంటారు. ఆ నాటి నుండి తురాయిగుడ స్వరూపమే మారిపోయింది. ఒరిస్సా నుండి వర్తకులు వచ్చారు. గిరిజనులు తవ్వితీసిన ఒక్కొక్క రాయినీ వందలూ వేలూ ఇచ్చి కొనుక్కొని పోసాగారు. బయట మార్కెట్‌లో దానికుండే విలువలో ఇది ఒక్క శాతమే కావచ్చు. కానీ ఆదివాసీలు దానిని పోల్చుకునేది తమకు సంప్రదాయకంగా వచ్చే దినసరి వేతనంతో. వ్యవసాయ పనులకు కూలికి పోయినా, సాగునీరు లేని అడవిచేలలో నడుములిరిగేలా పని చేసినా, అడవిలో బంక, కుంకుడుకాయలు వగైరాలు ఏరుకొచ్చి గిరిజన సహకార కార్పొరేషన్‌కు అమ్మినా రోజుకు సంపాదించే దానికన్న ఈ రంగురాళ్ల సేద్యం - రాయి దొరకాలే గానీ - చాలా రెట్లు ఎక్కువ ఫలాన్ని ఇస్తుంది. కాబట్టి త్వరలోనే అరకు ప్రాంతంలోని ఆదివాసులు, ఇతర జనం, మిగిలిన అన్ని పనులూ మానేసి సద్దులు కట్టుకొని పలుగుపారా చేత పట్టుకుని సూర్యోదయం నుండి అస్తమయం దాకా (లాంతరు పెట్టుకొని ఆ తరువాత కూడ) రంగురాళ్ల వేటలో పడ్డారు. అయితే వేటకు పోయేవాళ్లు ఎక్కువయ్యే కొద్దీ రాళ్లు దొరికేవారి సంఖ్య తక్కువయింది. సరయిన సర్వే జరిపి, రాళ్లు ఎక్కడ ఉండగలవో గుర్తించి, సాంకేతికంగా నిర్దుష్టమైన పద్ధతిలో తవ్వకం జరిపితే శ్రమకు తగ్గ ఫలితం దక్కేది. భద్రతా ఉండేది. కానీ 'వజ్రాల వర్తకులు' ఆ పనేం చేయలేదు. దానికి కావాల్సిన పెట్టుబడి పెట్టే ఉద్దేశ్యం, అవసరం వాళ్లకు లేవు. వాళ్లు విశాఖపట్నంలోని ఫైవ్‌స్టార్ హోటళ్లలోనూ, పాడేరు వంటి ఏజెన్సీ తాలూకా కేంద్రాలలో అద్దె ఇళ్లలోనూ బస చేసి బ్రోకర్లద్వారా గిరిజనులు ఏరితెచ్చిన రాళ్లు కొనుక్కునేవారు. వాటిని తీసుకుపోయి రాష్ట్రం బయట ఎక్కడో అమ్మి లక్షలు సంపాదించేవారు. రంగురాళ్ల విషయం బయటపడిన తర్వాత ఒక్క మూడునెలల కాలంలోనే 100 కోట్ల రూపాయలు విలువ చేసే రంగురాయి విశాఖ ఏజెన్సీనుండి బయటకు వెళ్లిపోయిందని అంచనా. ఈ 100 కోట్లపైన ప్రభుత్వం 5 శాతం రాయల్టీ సేకరించినా దానికి 5 కోట్ల ఆదాయం వచ్చి ఉండేది. ఆ 5 కోట్లు పాడేరు ఐటిడిఏ ద్వారా గిరిజనుల బాగు కోసం ఖర్చుపెట్టి ఉంటే ఎంతో మేలు జరిగి ఉండేది. కానీ ప్రభుత్వ అధికార్లకు - కనీసం అరకు ఎం ఆర్ వోకూ ఎస్‌ఐకీ - తొలినాటి నుండి ఈ సంగతి తెలిసినా వారు ప్రభుత్వానికి తెలియజేసి ఈ 'వజ్రాలవేట'ను క్రమబద్ధం చేసే ప్రయత్నం చేయలేదు. తమ జేబులు మాత్రం తడుపుకొని సంతృప్తి చెందారు.

కానీ కేవలం స్థానిక ప్రభుత్వ అధికార్లను తప్పుపట్టి ఊరుకోలేము. 1993లోనయితే రాష్ట్రప్రభుత్వ అధికార్లకు తెలియదనుకోవచ్చు. ఆ తరువాత అంతా తెలిసింది. తెలిసీ వారు చేసింది శూన్యం.

మొదటి మూడు నెలలలో 100 కోట్ల రంగురాళ్లు బయటికి పోయాయన్నాము. మూడు నెలల తర్వాత ఒక దుర్ఘటన కారణంగా ఈ వ్యవహారానికి తాత్కాలికంగా బ్రేక్‌పడింది. అంత పెద్దెత్తున, అనియతంగా జరిగిన ఈ వ్యవహారం చాలా అరాచకంగా జరిగిందని వేరే చెప్పనవసరం లేదు. పలుగుపార పట్టుకొని రంగురాళ్ల వేటలో గుట్టలూ పుట్టలూ తవ్వే జనం, వాళ్ల వెంటపోయి ఎక్కడ మంచిరాయి దొరికినా పొరుగువాడికి తెలియకుండా కొనేయాలని ఆరాటపడే బ్రోకర్లు, వర్తకులు, వీరి వ్యవహారాన్ని ఒక కంట కనిపెడుతూ అవకాశం దొరికినప్పుడు వాళ్ల సంపాదనలో వాటా కొట్టేయాలని కాచుకున్న పోలీసులు, రెవిన్యూ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది - ఆ దృశ్యం కోలాహలంగానే ఉండి ఉండాలి. దొమ్మీలు, గలాటాలు జరిగాయి. అటువంటి ఒక సందర్భంలో తురాయిగుడలో సెప్టెంబర్ 25 1993 నాడు అరకు ఎస్‌ఐ, ఎంఆర్‌వో ఇద్దరి సమక్షంలో జరిగిన లాఠీచార్జిలో బిజయ్‌కుమార్ జైన్ అనే ఒరిస్సా (కలహండి జిల్లా)కు చెందిన వర్తకుడు లాఠీదెబ్బలకు తలపగిలి చనిపోయాడు. నిజానికి ఎస్‌ఐ అతనిని పట్టుకొని కొట్టి మరీ చంపాడని ప్రత్యక్షసాక్షుల కథనం.

అప్పుడు చాలా గొడవయింది. 'వజ్రాల వేట'గా పేరుపొందిన రంగురాళ్ల వేటలో ఏమేం జరుగుతున్నదీ పత్రికలు వివరంగా రాసాయి. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ వ్యవహారాన్ని క్రమబద్ధం చేస్తే రాళ్లేరే గిరిజనులతో సహా అందరికీ మంచిదని పెద్దలందరూ (ఆంధ్ర విశ్వవిద్యాలయం జియాలజీ శాఖ పరిశోధకులతో సహా) సలహా ఇచ్చారు. కానీ ప్రభుత్వం రంగురాళ్ల తవ్వకాన్ని ఇక జరగనీయం అని ప్రకటించి ఊరుకొంది. కొన్నాళ్ల తరువాత అది మళ్లీ పుంజుకుంది. మరొక్క ఘోరమైన ప్రమాదం జరిగేదాకా అందరూ మరిచిపోయారు.

ఈ ప్రమాదం ఏజెన్సీలో జరగలేదు. ఏజెన్సీకి వెలుపల (అయితే ఏజెన్సీని ఆనుకొని) ఉన్న గొలుగొండ మండలంలో జరిగింది. అరకులో మొదలైన తవ్వకాలు త్వరలోనే పాడేరుకూ గొలుగొండకూ ఇతర ప్రాంతాలకూ పాకాయి. గొలుగొండ మండలంలోని పప్పుశెట్టిపాలెంలో పెద్ద ఎత్తున రంగురాళ్లున్నాయని తెలిసింది. తవ్వకాలు జోరుగా జరిగాయి. వివిధ కులాలకు చెందిన గిరిజనేతర పేదలు ప్రతిరోజూ ఉత్సాహంగా తవ్వుకుంటూ పోయారు. వాళ్లకు దొరికిన రంగురాళ్లను అక్కడే కాపుకాసిన వర్తకులూ, వర్తకుల బ్రోకర్లూ కొన్ని వందలో మహాఅయితే వేలో ఇచ్చి కొనుక్కుని పోయేవారు. బయట మార్కెట్‌లో వారు ఆ రాయిని ఎన్ని లక్షలకు అమ్ముకున్నా ఈ మాత్రం ఆదాయం దొరకడమే మహాభాగ్యమని భావించిన పప్పుశెట్టిపాలెం ప్రజలు రాళ్లు తవ్వితీస్తూనే ఉన్నారు.

అయితే తవ్వకం ప్రమాదభరితమైన పని. నేలలో తవ్వుతూ పోతుంటే సొరంగం లాగ ఏర్పడుతుంది. అది పై నేలకు సమాంతరంగా నేల లోపల

సాగుతుంది. ఎప్పటికప్పుడు తవ్వినమేరకు ఆ సొరంగం పై కప్పును నిలబెట్టడానికి ఏర్పాట్లు చేసుకుంటూ ముందుకు పోవాలి. లేకపోతే ఏదో ఒకరోజు కప్పు కూలిపోయి సొరంగంలోని కూలివాళ్లు సజీవంగా సమాధి అయ్యే ప్రమాదం ఉంటుంది. 1994 సెప్టెంబర్ 4న గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెంలో అదే జరిగింది.

నేలలో తవ్వి వస్తువులను (ఘన పదార్థమైనా ద్రవమైనా) వెలికితీసే ఉత్పత్తి వ్యవస్థను చట్టం 'గని' (mine) అంటుంది. మామూలు పరిభాషలో క్వారీ అని పిలిచేదీ, నూనెబావి (oil well) అని పిలిచేదీ, సహజ వాయువును నేలనుండి వెలికితీసే రిగ్గు అని పిలిచేదీ - అన్నీ చట్టం దృష్టిలో గని (mine) కిందికే వస్తాయి. వీటి నిర్వహణకు సంబంధించి వివరమైన నియమాలున్నాయి. వీటిలో పనిచేసే కార్మికుల భద్రతకు సంబంధించి వివరమైన చట్టాలున్నాయి. రంగురాళ్ల క్వారీలకు వర్తించే భద్రతా నియమాలు మెటలిఫెరస్ మైన్స్ రెగ్యులేషన్, 1961లో ఉన్నాయి. ఈ నియమాలు అమలయ్యేటట్టు చూసే బాధ్యతగల అధికారులు కేంద్రస్థాయిలోనూ రాష్ట్రస్థాయిలోనూ ఉన్నారు. గనుల చట్టం,1952 ఈ అధికార్ల గురించి చెపుతుంది. ఈ అధికారులు ఎప్పుడయినా ఏ గనినైనా ఇన్స్పెక్ట్ చేయవచ్చు. గని నిర్వహణకు సంబంధించి దాని యాజమాన్యానికి తగు ఆదేశాలు జారీ చేయవచ్చు. భద్రతా నియమాలను అతిక్రమించిన వారిపైన కేసువేసి ప్రాసిక్యూట్ చేయవచ్చు. గని యాజమాన్యానికి గనులను భద్రంగా నిర్వహించే బాధ్యత ఉండడమేకాక, గనిలో జరిగే ప్రతి ప్రమాదాన్నీ పైన పేర్కొన్న అధికార్లకు తెలియజేయవలసిన బాధ్యత కూడా ఉంది.

కానీ ఉత్తరాంధ్ర జిల్లాలలో రంగురాళ్ల తవ్వకం జరుగుతున్న క్వారీలకు యజమానులెవరూ లేరు. వాటికి ఒక 'గని' స్వరూపమే (చట్టం కళ్లలో) లేదు. రంగురాళ్లు కొనుక్కొనిపోయే వర్తకులు ఆ క్వారీల యజమానులు కారు. వాటిలో తవ్వకాలు జరిపే కూలివాళ్లు ఎట్లాగూ కారు. ప్రభుత్వం ఆ వర్తకులకే ఆ క్వారీలను లీజుకు ఇచ్చివున్నా లేక తానే రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వాటిని నడిపి ఉన్నా వాటికి చట్టం కళ్లలో 'గని' స్వరూపం వచ్చి ఉండేది. భద్రతా చట్టాల పరిధిలోకి ఆ క్వారీలు వచ్చి ఉండేవి. అంతమాత్రం చేత ప్రమాదాలేవీ జరగవని కాదు. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న సింగరేణి బొగ్గు గనులలో సాలీనా 30 నుండి 40 మంది కార్మికులు గనిప్రమాదాలలో చనిపోతున్నారు. అయితే అది ఒక లక్షమందికి పైగా పనిచేసే కంపెనీ. దానికి గని స్వరూపం లేకుండ ఎవరుపడితే వాళ్లు తట్టపార పట్టుకొని బొగ్గు తవ్వి లారీలలో పోసే పద్ధతిలో నడిచి ఉంటే ఇంకెన్ని ప్రమాదాలు జరిగి ఉండేవో!

కానీ 1993 నుండి 1996 దాకా ప్రభుత్వం విశాఖ, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలలోని రంగురాళ్ల క్వారీలను అట్లాగే నడవనిచ్చింది. ఆ క్వారీలను చట్టం పరిధిలోకి తీసుకొచ్చి వాటిని ప్రైవేట్ వ్యక్తులకైనా గిరిజన సహకార సంఘాలకైనా ప్రభుత్వ సంస్థలకైనా లీజుకు ఇచ్చి ఉంటే వాటిలో రంగురాళ్లు ఏరే జనం క్వారీ కార్మికులయి ఉండేవారు. భద్రతా నియమాలేకాక, ప్రమాదం జరిగినప్పుడు నష్టపరిహారం కల్పించే చట్టాలు కూడ వారికి వర్తించేవి. చనిపోయిన 23 మంది కుటుంబాలకు ఆర్థిక రూపేణా కొంత ఊరట అయినా దక్కేది. ప్రభుత్వం ఇదేదీ లేకుండ చేసింది. లీజుకిచ్చే అధికారాన్ని నిర్వచించడానికీ దాని నియమాలను నిర్దేశించడానికీ ఒక కేంద్రచట్టం (Mines and Minerals (regulation and development) Act, 1957), ఒక రాష్ట్ర చట్టం (A.P. Minor Mineral Concession Rules, 1966) ఉన్నాయి. ఈ చట్టాలున్నాయంటే అర్థం, ఎక్కడయినా ఒక పద్ధతి ప్రకారం తవ్వకాలు జరుగుతుంటే దానిని గనుల చట్టం కిందికి తీసుకొచ్చి లీజు ఇచ్చి ఆ తవ్వకాలను క్రమబద్ధం చేసే బాధ్యత ప్రభుత్వం మీద ఉందని. అప్పుడు కార్మికులకు కొంత రక్షణ ఉంటుంది, తవ్వకం క్రమబద్ధంగా జరుగుతుంది, పర్యావరణ విధ్వంసాన్ని నిలువరించే అవకాశం ఉంటుంది, పైగా ప్రభుత్వానికి ఆదాయం కూడ వస్తుంది. ఈ బాధ్యతను రాష్ట్రప్రభుత్వం విస్మరించడమంటే తన పరిపాలనా బాధ్యతను విస్మరించడమే.

దీని ఫలితం పప్పుశెట్టిపాలెంలో బయటపడింది. ఒక పద్ధతి లేకుండ, ఏ జాగ్రత్తలు లేకుండ క్వారీని జనం తవ్వుకుంటూ పోయారు. వాళ్లు వెలికితీసిన విలువైన రంగురాళ్లను కొనుక్కుపోయే వర్తకులకు ఆ క్వారీతో చట్టరీత్యా ఏ సంబంధం లేనట్టే, ఏ బాధ్యతా లేనట్టే. ప్రభుత్వం తన విధాన రాహిత్యంతో వారికి బాధ్యత లేకుండ లాభాలు పొందే అవకాశాన్ని కల్పించింది.

చివరికి 1994 సెప్టెంబర్ 4న అస్తవ్యస్తంగా ఎవరికి తోచినట్టు వారు పోటాపోటీగా తవ్వుకుంటూ పోయిన పప్పుశెట్టిపాలెం క్వారీ కుప్పకూలింది. ఆ సమయంలో లోపల ఎంతమంది ఉన్నారో కూడ ఎవరికీ తెలీదు. 100 మంది ఇరుక్కున్నారనీ 70 మంది ఇరుక్కున్నారనీ

**పప్పుశెట్టిపాలెం మృతులు**

| పేరు (వయస్సు) | ఊరు | కులం |
|---|---|---|
| పులిగ నూకరాజు (18) | గొలుగొండ | బిసి (తెలకల) |
| పుల్లేటికుర్తి అప్పలరాజు (28) | గొలుగొండ | బిసి (మంగలి) |
| వార నాగరాజు (55) | గొలుగొండ | ఎస్‌సి |
| సారమండ నూకరాజు (30) | గొలుగొండ | ఎస్‌సి |
| పండ అర్జునరావు (30) | గొలుగొండ | అగ్రకులం (తెలగ) |
| కొత్త సత్యనారాయణ (20) | జోగుంపేట | అగ్రకులం (తెలగ) |
| పండ బాబురావు (28) | గొలుగొండ | అగ్రకులం (తెలగ) |
| అనపర్తి గోవిందు (26) | గొలుగొండ | బిసి (తెలకల) |
| నిర్జోగి రామకృష్ణ (18) | గొలుగొండ | బిసి (కొప్పుల వెలమ) |
| సారమండ నూకరాజు (35) | గొలుగొండ | ఎస్‌సి |
| అంకంరెడ్డి నారాయణమూర్తి (45) | నర్సింగపల్లి | బిసి (కొప్పుల వెలమ) |
| పప్పుల రామకృష్ణ (25) | నర్సింగపల్లి | బిసి (కొప్పుల వెలమ) |
| జక్కా చిన్నబాబులు (20) | జోగుంపేట | బిసి (కొప్పుల వెలమ) |
| మాకిరెడ్డి రమణ (26) | జోగుంపేట | బిసి (కొప్పుల వెలమ) |
| కుంచ నూకరాజు (22) | జోగుంపేట | ఎస్‌సి |

వదంతులు వ్యాపించాయి. చివరికి శవాలను బయటికి తీయగా 15 మంది చనిపోయినట్టు తేలింది.

మళ్లీ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం గురించి కొంచెం గొడవ జరిగింది. కానీ అప్పటికీ ప్రభుత్వం పూర్తిగా కళ్లు తెరవలేదు. రంగురాళ్ల తవ్వకాన్ని క్రమబద్ధం చేయలేదు. పోనీ పూర్తిగా నిషేధించిందా అంటే అదీ లేదు. ఏం చేసిందంటే, బలహీనమైన చట్టాలను ప్రయోగించి అటకాయించే ప్రయత్నం చేసింది. నేలలో దొరికిన నిధి ఏదయినా ప్రభుత్వానికే చెందుతుందన్న చట్టం కింద వర్తకులను అరెస్టు వేయడం, కేసులు పెట్టడం జరిగింది. రిజర్వ్ ఫారెస్టులోకి చొరబడటం చట్టవిరుద్ధమన్న శాసనం కింద కూడ కేసులు పెట్టారు. ఇవి రెండూ బెయిలబుల్ నేరాలే. శిక్ష తక్కువే. అంతేకాక, ప్రభుత్వం అనుమతి లేకుండ తవ్వకాలు జరిపేవారి పనిముట్లను స్వాధీనం చేసుకోవచ్చునని చెప్పే చట్టం ప్రయోగించి రంగురాళ్లు తవ్వుతున్న గిరిజనుల తట్టాబుట్టా స్వాధీనం చేసుకోసాగారు. దీనివల్ల రంగురాళ్ల వేట తాత్కాలికంగా మాత్రమే ఆగింది. నిజానికి ఈ చర్యలు పోలీసు, రెవిన్యూ, అటవీశాఖల సిబ్బందికి లంచాలు మరింతగా తీసుకోవడానికి పనికొచ్చినంతగా అనియతంగా సాగుతున్న తవ్వకాలను ఆపడానికి పనికి రాలేదు.

ఈ లోపల కొత్తప్రదేశాలలో రంగురాళ్ల వేట మొదలైంది. విశాఖపట్నం నుండి తూర్పుగోదావరికి పాకింది. అడ్డతీగల, రంపచోడవరం మండలాలలో 'వజ్రాల' క్వారీయింగ్ 1995 నుండి ప్రారంభమయింది. రెండవ పెద్దప్రమాదం అక్కడే జరిగింది. 1995 మార్చి 9వ తేదీన అడ్డతీగల నుండి వై.రామవరం పోయే రోడ్డుపక్కన తపసికొండ అంచున ఉన్న దుప్పులపాలెం శివారులో రంగురాళ్ల క్వారీ అకస్మాత్తుగా కూలి నలుగురు సజీవసమాధి అయ్యారు. వారిలో ఇద్దరు స్త్రీలు, ఇద్దరు పురుషులు. నలుగురూ గిరిజనులే. వారు చేస్తున్న తవ్వకాన్ని ప్రభుత్వం చట్టం పరిధిలోకి తీసుకురాకపోవడం వల్ల వారికి భద్రత కల్పించే ఏర్పాట్లేవీ క్వారీలో లేకుండ పోయాయి. చనిపోయిన తరువాత వర్క్‌మెన్స్ కాంపెన్సేషన్ చట్టం కింద నష్టపరిహారమూ దక్కలేదు. వారు తవ్వితీసిన రంగురాళ్లను కొనుక్కుపోయిన వర్తకులకు ఏ బాధ్యతా అంటలేదు. వారి చావుకు వారి 'కక్కుర్తే' కారణం అయింది. వారు అప్పటిదాకా తవ్వితీసిన రంగురాళ్లు కొనుక్కొని లక్షలార్జించిన వర్తకులు, వేలాదిగా వారి దగ్గర, వర్తకుల దగ్గర కమిషన్లు మేసిన ప్రభుత్వ సిబ్బంది కక్కుర్తి మనుషులు కాకుండ పోయారు. అందరి కక్కుర్తికీ గిరిజనులు మాత్రమే బలయ్యారు.

మళ్లీ కొంచెం గొడవయింది. తెలుగు దినపత్రికలు, ఢిల్లీలోనూ బొంబాయిలోనూ ప్రచురితమయ్యే ఆంగ్ల వారపత్రికలు వ్యాసాలు రాసాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం జియాలజీ శాఖ అధ్యాపకులు ప్రభుత్వానికి హితోపదేశం చేస్తూ మళ్లీ ఉత్తరాలు రాసారు. రంగురాళ్ల తవ్వకాన్ని ప్రభుత్వం క్రమబద్ధం చేస్తే ప్రభుత్వానికీ ప్రజలకూ ఎన్నిరకాలుగా ప్రయోజనకరమో వివరించారు. ఒరిస్సా ప్రభుత్వం నెలకొల్పిన రంగురాళ్ల తవ్వకం, పాలిషింగ్, అమ్మకం వ్యవస్థను, గిరిజనులకు దానివల్ల జరిగిన మేలునూ ఉదహరించారు. అయినా మన రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించలేదు. రంగురాళ్ల తవ్వకానికీ అమ్మకానికీ మరికొన్ని ఆటంకాలు కల్పించింది, క్వారీల దగ్గర నిషేధాజ్ఞలు ప్రకటించింది, మరికొన్ని కేసులు పెట్టి మరి కొంతమందిని అరెస్టు చేసింది. అయినా జరిగేది జరుగుతూనే ఉంది, అధికార్ల జేబులు నిండుతూనే ఉన్నాయి.

నిజానికి ఈ అరకొర నిషేధం వల్ల జరిగిందేమిటంటే రంగురాళ్ల తవ్వకంలో పాల్గొంటున్న గిరిజనులు తమని తాము నేరస్తులుగా భావించి ఏదో తప్పు చేస్తున్నవారి లాగా ప్రవర్తించడం, ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరికీ తెలియకుండ దాచిపెట్టడం, వైద్యానికి ఆసుపత్రికి పోతే క్వారీలో దెబ్బ తగిలిన విషయం బయటపడుతుందేమోనని భయపడి వైద్యం చేయించుకోకుండ ఉండడం, చనిపోయినప్పుడు కూడ అధికార్లకు తెలియకుండ ఉంచాలని తాపత్రయపడడం. దుప్పులపాలెం ఘటనలో నాల్గవ వ్యక్తి 'గుర్తు తెలియకుండ' ఉండిపోవడానికి ఈ భయమే కారణం కావచ్చు.

చివరికి 1996లో మొట్టమొదటిసారిగా రాష్ట్రప్రభుత్వం కదిలింది. విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీయేతర ప్రాంతం మేరకు లీజుద్వారా రంగురాళ్ల తవ్వకాన్ని క్రమబద్ధీకరించింది. రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడు గ్రామాలలో క్వారీయింగ్ లీజుల వేలంపాట 1996 నవంబర్ 6వ తేదీన జరిగింది. అందులో చింతపాక, పప్పుశెట్టిపాలెంలలో లీజు పాడుకున్నవారు మంచిలాభాలు సంపాదించుకున్నారు. అధికార్లకు లంచాలు మేపి అమ్మిన ధర కంటే తక్కువ చూపించి చాలా మిగుల్చుకున్నారు. అయినప్పటికీ ఈ లీజుద్వారా క్వారీయింగ్ క్రమబద్ధం కావడం, రాళ్లు తవ్వే ప్రజలకూ లీజు తీసుకున్న వ్యక్తికీ మధ్య కార్మిక-యాజమాన్య సంబంధాన్ని ఏర్పరచింది. తద్వారా కొంత భద్రత కలిగింది.

అయితే ఇది ఈ ఏడు గ్రామాల లీజులకు మాత్రమే వర్తిస్తుంది. లీజులేని చోట క్వారీయింగ్‌ను నిషేధించే గట్టి చర్యలేవీ ప్రభుత్వం తీసుకోలేదు. అక్కడ రంగురాళ్ల తవ్వకం సాగుతూనే ఉంది. అక్కడ వర్తకులది బాధ్యతలేని లాభాల వేట. కూలివాళ్లది భద్రతలేని ప్రయాస. లీజుకు ప్రభుత్వం ఏజెన్సీయేతర ప్రాంతాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటంటే ఏజెన్సీలోని క్వారీలన్నీ రిజర్వ్‌ఫారెస్టులో ఉన్నాయి. అక్కడ కేంద్రప్రభుత్వం అనుమతి లేకుండ లీజులివ్వడానికి వీలులేదు. అంతేకాక, అక్కడ

దుప్పులపాలెం మృతులు

| పేరు (వయస్సు) | ఊరు | కులం |
|---|---|---|
| వలారి ఆదిరాజు (35) | తుంగమడుగుల | ఎస్‌టి (కొండరెడ్డి) |
| మిరియాల పాపాయమ్మ (35) | అనుకుల పాలెం | ఎస్‌టి (కోయ) |
| బాకూరి ఈశ్వరమ్మ (45-50) | పి. ఎర్రగొండ | ఎస్‌టి (కొండరెడ్డి) |
| ఒక పేరు తెలియని పురుషుడు | | |

(తపసి కొండ దగ్గర రంగురాళ్లు తవ్వుతున్నవారంతా అడ్డతీగల, వై. రామవరం మండలాలకు చెందిన ఆదివాసీలే కాబట్టి ఇతను కూడ ఆదివాసీయే అయివుండాలి).

గిరిజనేతరులకు లీజు ఇవ్వడానికి '1 ఆఫ్ 70 చట్టం' (అంటే ఆం.ప్ర.షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టం-A.P.S.L.T.R Act) అడ్డం వస్తుంది. నిజానికి, కేంద్ర ప్రభుత్వం అనుమతి పొంది గిరిజన సహకార సంఘాలకే లీజుకిచ్చి, వారికి మైనింగ్‌లో శిక్షణ ఇచ్చి పాలిషింగ్ నేర్పించి పాలిషింగ్ యూనిట్లు నెలకొల్పి ఉంటే ఆదివాసీలకు ఎంతో మేలు జరిగి ఉండేది. మన పాలకులు అదేమీ చేయకపోగా రంగురాళ్ల వేటను గట్టిగా అరికట్టే ప్రయత్నాలు సహితం చేయలేదు. ఏజెన్సీ ప్రాంతాలలో బాధ్యతలేని - భద్రతా లేని - వేట కొనసాగింది.

దాని ఫలితంగా 1997 నవంబర్ 25 రాత్రి విశాఖపట్నం ఏజెన్సీలోని జి.మాడుగుల మండలంలోని వంజర గ్రామ పంచాయితీకి చెందిన కొర్రపాడు దగ్గరున్న క్వారీ కుప్పకూలి నలుగురు గిరిజన బాలురు చనిపోయారు. వారిలో ముగ్గురు అదే ఊరికి చెందిన కోందు గిరిజనులు. వారి పేర్లు గెమ్మెల రుప్ప, గెమ్మెల ముంద్ర, సీదర సూరి. ముగ్గురి వయస్సు 12 సంవత్సరాలే. నాలుగవ వ్యక్తి హుకుంపేట మండలం తీగలవలసకు చెందిన గురివింతల ప్రభాకరరావు అనే వాల్మీకి గిరిజనుడు. అతని వయసూ దాదాపు అంతే. అంత చిన్న వయస్సున్న పిల్లలను తవ్వకానికి పెద్దలు పోనీయరు కాబట్టి ఈ నలుగురూ మరో ఇద్దరూ సాయంత్రం చీకటిపడిన తర్వాత ఎవరికీ చెప్పకుండ హరికేన్ లాంతరు తీసుకొని పగలు పెద్దలు తవ్విన క్వారీలో ఏమైనా దొరుకుతుందేమో ఏరుకుందామని పోయారు. అప్పటికి పదిరోజులుగా తవ్వుతున్న ఆ క్వారీ పై కప్పుకు ఎటువంటి ఆధారం లేకపోవడం వల్ల ఆ రాత్రి 10 గంటల సమయంలో కుప్పకూలింది. ఈ నలుగురూ చనిపోగా మిగిలిన ఇద్దరూ తప్పించుకొని బయటపడ్డారు.

పరిస్థితి ఇకపైనయినా బాగవుతుందన్న నమ్మకం లేదు. ప్రభుత్వం రంగురాళ్ల తవ్వకాన్ని పూర్తిగా నిషేధించదు, దాని జోలికి పోవద్దని గిరిజనులకు నచ్చజెప్పదు. ప్రమాదకరమైన తవ్వకపు పద్ధతుల ద్వారా పేదప్రజలు వెలికితీసే రంగురాళ్లు కొనుక్కుపోయే వర్తకుల వ్యాపారాన్ని నిషేధించే చట్టమేదీ చేయదు. ఆ వ్యాపారాన్ని అడ్డుకోవడానికి గట్టి చర్యలేవీ తీసుకోదు. అప్పుడప్పుడు నిషేధాజ్ఞలు పెట్టి అరెస్టులు చేసి, బెయిలబుల్ కేసులు పెట్టి విడిచిపెట్టే ప్రస్తుత విధానం వల్ల జరిగేదేమిటంటే రంగురాళ్ల తవ్వకం, కొనుగోలు సాగుతూనే ఉంటాయి కానీ ఈ వ్యవహారం చట్టం పరిధిలోకి రాదు కాబట్టి అందులో పాల్గొనే ఆదివాసీ తదితర పేదజనానికి భద్రత ఏ కోశానా ఉండదు. వారికి

## 'వజ్రాల'వేటలో పీడకలవేట

ఉత్తరాంధ్రలో 'కలర్‌ఫుల్' రాజకీయ నాయకులుంటారు. వారిలో ఒకరు విశాఖపట్నం జిల్లా చోడవరం ఎం ఎల్ ఏ ఎర్రునాయుడు. ఇతనిని మిలిట్రీ నాయుడు అనీ, క్లుప్తంగా మిలిట్రీ అనీ పిలుస్తారు. తూర్పుకనుమలలో 5000 కోట్ల రూపాయలు విలువ చేసే రంగురాళ్ల నిక్షేపాలున్నాయని మిలిట్రీ నాయుడికి తెలియగానే ఆ రాళ్లన్నిటినీ తానే వెలికితీసి తెలుగుజాతికి కానుక ఇవ్వాలని వారికి కోరిక కలిగింది. ఆ సంపదతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు తన రెండు రూపాయల కిలో పథకాన్ని నిరాటంకంగా కొనసాగించగలుగుతాడని వారు భావించారు. ఆ మాటే 'అన్నగారి'తో అన్నాడు. ఆ అన్నగారూ తగినవాడే. తాను తెలుగు ప్రజలకు రాజునని తన వాక్కే చట్టమనీ ఆయన పదవిలో ఉన్నన్నాళ్లూ భావించాడు. ఎవరయినా సకాలంలో జ్ఞాపకం చేస్తే తప్ప రాచరికాలకు కాలం చెల్లిందనీ ఇప్పుడు పరిపాలన చట్టాల ప్రకారం, రాజ్యాంగ నియమాల ప్రకారం జరగాలనీ ఎన్టీఆర్‌కు తోచేదికాదు. కాబట్టి వారు సహితం మిలిట్రీనాయుడు సూచనకు స్పందించి ఒక ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించి మిలిట్రీనాయుడు సత్సంకల్పానికి అధికారులందరూ సహకరించాలని ఆదేశించారు. దీని భావమేమిటో ఆయనకు వివరించి చెప్పి అది కుదరదని వారించే అధికారులు లేకుండా పోయారు. పైగా గనులతో ఏమీ సంబంధం లేని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ సి.ఎన్.రావుగారు (అనేక అవినీతి కేసులలో ఇరుక్కొని ఉన్న మహానుభావుడు) వెనువెంటనే తన కింది అధికార్లందరికీ ఒక సర్క్యులర్ జారీ చేసాడు (1995 ఏప్రిల్ 19న). దానిలో ఏం చెప్పాడంటే శ్రీకాకుళం నుండి ఖమ్మందాకా తూర్పుకనుమలలో ఉన్న రంగురాళ్లు 'సర్వే' చేసే అధికారం చోడవరం ఎం ఎల్ ఏకి ఇవ్వబడిందనీ అతనికీ అతని మనుషులకూ అధికారులందరూ సహకరించాలనీ రాసాడు. ఈ సర్క్యులర్ చూసి రాష్ట్రంలోకి కొత్తగా జాగీర్దారీ వ్యవస్థ ఎప్పుడు చొరబడిందా అని విస్మయం చెందిన అధికార్లు తప్పనిసరయి దానిని పాటించారు. మిలిట్రీనాయుడు ఉరఫ్ ఎర్రునాయుడుగారి సర్వే 1995 ఏప్రిల్ నెలలో చాలా ఉత్సాహభరితంగా ప్రారంభం అయింది. 10 రోజులపాటు నిరాఘాటంగా సాగింది. మిలిట్రీనాయుడు మనుషులు రిజర్వ్‌ఫారెస్టులో ఇష్టం వచ్చినట్టు తవ్వసాగారు. గనులశాఖ అధికారులు, అటవీశాఖ అధికారులు పక్కన నిలబడి ఈ తవ్వకానికి అధికార ముద్రవేయగా పోలీసు రెవిన్యూ సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేసారు. హైదరాబాద్ నుండి పర్యవేక్షణ పేరిట కొంతమంది అధికార్లు వచ్చి పక్కన నిలబడ్డారు. వీరి టి ఏ డి ఏలకు రెండు లక్షలు ఖర్చయింది. 10 రోజుల తవ్వకంలో కోట్ల రూపాయల విలువగల రాళ్లు దొరికాయని మొదట్లో అధికారులు ప్రకటించారు. వాటిని సీల్డుకవరులో జిలా కలెక్టర్‌కు అప్పగించారు. కానీ వాటిని నిపుణులు పరిశీలించిన తరువాత వాటి వెల 27 వేల రూపాయలేనని నిర్ధారించారు! అంటే టిఏడిఏ ఖర్చులో పదవవంతు దక్కిందన్నమాట. కానీ కవర్ మండి కొన్ని రాళ్లు మాయమయ్యాయని వదంతులు వ్యాపించాయి. అదెంత నిజమో ఇప్పటికీ తెలీదు. ఇదంతా పెద్దగొడవకు దారి తీసింది. తెలుగుదేశం ఎం ఎల్ ఏకి ఖనిజసంపదను ధారాదత్తం చేయడమేమిటని కాంగ్రెస్‌వాళ్లు గొడవ చేసారు. మిలిట్రీనాయుడు ఎన్టీఆర్‌కు వజ్రాల కిరీటం పెడతానని హామీ ఇచ్చాడని కాంగ్రెస్ అనుకూల పత్రికలు రాసాయి. ఎన్టీఆర్ గాభరాపడి తాను చెప్పిందొకటైతే అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ చేసిందొకటని చెప్పి ఆ అధికారిని బదిలీచేసి మిలిట్రీనాయుడు ఉదంతానికి సమాప్తి పలికాడు.

ప్రమాదం జరిగినా చెప్పుకోరు - చెప్పుకుంటే ముందు తమ మీదే వీదో ఒక కేసు (రిజర్వ్ ఫారెస్టు లోకి చొరబడ్డారనో, ఖనిజ సంపదను ప్రభుత్వానికి అప్పగించకుండ ప్రైవేట్‌గా అమ్ముకున్నారనో) పెడతారని భయం. ప్రమాదంలో చనిపోతే గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టాలని చూస్తారే తప్ప మామూలుగా పిడుగుపాటుకు చనిపోతే ప్రభుత్వం నుండి కోరుకునే పాటి ఎక్స్‌గ్రేషియా సహితం అడగరు, పొందరు. పప్పుశెట్టిపాలెంలో, దుప్పులపాలెంలో, కొత్రపాడులో ఇప్పటికి చనిపోయిన 23 మందిలో ఏ ఒక్కరికీ (ఆదివాసీలతో సహా) ఒక్క పైసా కూడ నష్టపరిహారం దక్కలేదు.

రంగురాళ్లు హానికరమైన వస్తువయినట్టయితే లేక దాని తవ్వకం పర్యావరణాన్ని ధ్వంసం చేసే క్రియ అయినట్టయితే దానిని పూర్తిగా నిషేధించి దాని జోలికి పోవద్దని గిరిజనులకూ ఇతర పేదప్రజలకూ నచ్చజెప్పడం హేతుబద్ధమైన విధానం అయి ఉండేది. అప్పటికీ తవ్వకానికి పోయిన వాళ్లపైన కేసులు పెట్టి అరెస్టు చేయడం తప్పనిసరి కావచ్చును గానీ ప్రధానంగా వారికి నచ్చజెప్పే మార్గాన్ని ప్రభుత్వం ఎంచుకోవలసి ఉంటుంది.

కానీ నిజానికి రంగురాళ్ల తవ్వకం వల్ల అడవికిగానీ అడవి జనానికిగానీ నష్టమేమీ ఉండదు. అడవిని నాశనం చేసేంతటి సాంద్రతరమైన నిక్షేపాలేమీ లేవు. పైగా వాటికి మార్కెట్‌లో మంచిధర ఉంది. ఆదివాసీలలో కొంతమంది కైనా వాటివల్ల మెరుగయిన జీవనం పొందే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం చేయవలసింది రంగురాళ్ల క్వారీలను క్రమబద్ధం చేసి గనుల చట్టాల పరిధిలోకి తీసుకురావడం. ఏజెన్సీలో ఉన్న క్వారీల లీజును గిరిజన సహకార సంఘాలకు ఇవ్వడం. (బయట మామూలుగా వేలంపాట పెట్టుకోవచ్చు). తవ్వితీసిన రంగురాళ్లను సానపెట్టే పాలిషింగ్ యూనిట్లు అక్కడే నెలకొల్పి అవే సహకార సంఘాలకైనా లేక నిరుద్యోగ గిరిజన యువకులకైనా ఇచ్చి వారికి పాలిషింగ్‌లో శిక్షణ ఇచ్చి సానబెట్టిన రంగురాళ్లను తగుధరకు రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (APMDC) కొనుగోలు చేసే ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. ఇది ఇప్పటికి చాలామంది సూచించిందే. కానీ మన రాష్ట్రపాలకుల చెవికి ఎక్కడం లేదు. కానీ ఇప్పటికైనా ఈ నిర్ణయం తీసుకొని అమలు చేయకపోతే మళ్లీ క్వారీ ప్రమాదాలు జరగడం, అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోవడం తప్పదేమో. ●

# ‘ఎన్‌కౌంటర్లు’

## జనవరి-ఫిబ్రవరి నెలలలో రాష్ట్రంలో ఎన్‌కౌంటర్లు (21 ఘటనలలో 38 మంది మృతి)

రెండు నెలలలో 38 మంది ఎన్‌కౌంటర్ల పేరిట చంపబడటం అసాధారణమైన విషయమే. అందులో మూడు ఘటనలలో సాయుధ దళ సభ్యులు చాలామంది (19 మంది) చనిపోయారు. అంతమాత్రం చేత ఆ మూడు ఘటనలూ ‘నిజమైన’ ఎన్‌కౌంటర్లని అనుకోకూడదు. అంటే పోలీసులు కేవలం ప్రాణరక్షణ కోసం కాల్పులు జరిపారనీ, చనిపోయిన 19 మంది దళసభ్యులూ ఆ క్రమంలోనే చనిపోయారనీ అనుకోకూడదు. అందుకు భిన్నంగా, మూడు ఘటనలలోనూ కాల్పులు మొదలుపెట్టింది పోలీసులే. అకస్మాత్తుగా సాయుధ నక్సలైట్లు తారసపడగా గాభరాపడి కాల్పులు మొదలుపెట్టారేమో ననుకుంటే పొరబాటే. సాయుధ నక్సలైట్లు ఫలానాచోట ఉన్నారని తెలిసి (పెద్దపులి ఫలానా చోట ఉందని తెలిస్తే చంపడానికి బయలుదేరినట్టు) బయలుదేరిపోయి ఏ వైపునుండి, ఏ విధంగా, దాడిచేస్తే తాము చావకుండా వాళ్లను చంపిరావచ్చునో ఆలోచించి వ్యూహం వేసి వాళ్లను హతమార్చారు పోలీసులు. పోలీసులు చట్టాన్ని కాపాడే యంత్రాంగమే అయితే, వాళ్లకు తుపాకులు యిచ్చింది అందుకోసమే అయితే, ఈ ప్రవర్తన సరయినదేనా? సాయుధ నక్సలైట్లు (లేక ఏదో ఒక సాయుధ బృందం) ఫలానా చోట ఉందని తెలిస్తే నేరుగా వాళ్లను చంపి రావడమేనా పోలీసుల విధి? అసలు వాళ్ల విధేనా? అది చట్టబద్ధమైన ప్రవర్తనేనా? సాయుధులైన వ్యక్తులు కనిపిస్తే వాళ్లను అక్కడికక్కడ కాల్చి చంపవచ్చునని పోలీసులకు అధికారం ఇచ్చే చట్టమేదీ భారతదేశంలో లేదు. పోలీసులకూ సైనిక అధికార్లకూ ప్రాణం తీయడానికి విశేష అధికారాలు ఇచ్చే కల్లోలిత ప్రాంతాల చట్టం, సైనిక దళాల (ప్రత్యేక అధికారాల) చట్టం కూడ ‘తుపాకి పట్టుకున్న వాళ్లెవరినైనా కాల్చిపారేయొచ్చు’ అని చెప్పవు. అయినా ఆ చట్టాలు ప్రస్తుతం కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలకు వర్తించవు. మరి ఈ మూడు జిల్లాలలోనూ నక్సలైట్లను వన్యమృగాలను వేటాడినట్టు వేటాడి చంపిన పై మూడు ఘటనలను పోలీసులు ఏ చట్టాన్ని అడ్డం పెట్టుకుని సమర్థించుకుంటారు?

చట్టబాహ్యమైన ఈ వేటలో భాగంగా పోలీసులకు ఈమధ్యకాలంలో గ్రనేడ్లు, గ్రనేడు లాంచర్లు కూడ మన రాష్ట్రప్రభుత్వం సరఫరా చేస్తున్నది. వరంగల్‌లో ఆరుగురు పీపుల్స్‌వార్ దళ సభ్యులను, ఒక రైతును మట్టుబెట్టిన గుండ్లసాగరం ‘ఎన్‌కౌంటర్’లో పోలీసులు గ్రనేడ్లు ప్రయోగించినట్టు స్పష్టమైన ఆధారాలున్నాయి. లేకపోతే ఆ ఘటనలో అంతమంది చనిపోయేవారు కాదు. పోలీసులకు గ్రనేడ్లు సరఫరా చేయడం చట్టరీత్యా సబబేనా? చట్టం పోలీసులకు కొన్ని పరిమితమైన సందర్భాలలో మాత్రమే బలప్రయోగం చేసే అధికారం ఇస్తుంది. వాటిలో ఏ ఒక్కదానికీ గ్రనేడ్ తగిన ఆయుధం కాదు. ప్రాణాన్నీ ఆస్తినీ కాపాడడానికి, దొమ్మీని అదుపు చేయడానికి, అరెస్టును ప్రతిఘటించి తప్పించుకోజూస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోవడానికీ పోలీసులు బలప్రయోగానికి పాల్పడవచ్చును. కానీ ఈ అన్ని సందర్భాలలోనూ వాళ్లు బలప్రయోగం చేయవలసింది ఆయా చట్టబద్ధమైన లక్ష్యాల సాధన కోసమే తప్ప వాటికి ఆటంకంగా ఉన్న వ్యక్తులను గాయపరచడం కోసం కాదు. గాయపరచడం ఆ క్రమంలో జరగవచ్చును. కానీ అదే లక్ష్యం కాదు. లక్ష్యసాధనలో భాగంగా తప్పనిసరి పరిస్థితులలో కలిగించే ఆ గాయం ఎంత తక్కువ ఉండగలిగితే అంత తక్కువ ఉండాలని - అంటే పోలీసులు తమకు చట్టం అనుమతించే బలప్రయోగాన్ని వీలయినంత తక్కువ మోతాదులో చేయాలని - చట్టం స్పష్టంగా అంటుంది. ఎవరినీ గాయపరచడం పోలీసుల బలప్రయోగానికి లక్ష్యం కావడానికి వీలులేదనీ,